కరెంటు ఉండని ప్రాంతాలు

అత్తాపూర్, మే 20: టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సంజీవనీ హిల్స్, నలందానగర్, సిరిమల్లేనగర్, ఏసీకాలనీ, హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు నలందానగర్, లోటస్ స్కూల్, ప్రెజెంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్‌కాలనీ, జనప్రియ ఓహెచ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు న్యూ ఫ్రెండ్స్‌కాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, ప్లెజెంట్ పార్కు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నిర్వహణ చార్జీలు ఇవ్వకుంటే సదుపాయాలు కల్పించలేం

వివరాలు తెలుపుతున్న రవీందర్‌రెడ్డి

ఖైరతాబాద్, మే 20: అపార్టుమెంట్ నిర్వహణ చార్జీలు చెల్లించకుంటే సదుపాయాలు కల్పించలేమని సఫైర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పంజాగుట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ అపార్టుమెంటులో మొత్తం 102 ఫ్లాట్లు ఉండగా, పది ప్లాట్ల యజమానులు ఏడు సంవత్సరాలుగా నిర్వహణ చార్జీలు చెల్లించకపోవడంతో వారికి సదుపాయాలను నిలిపివేశామన్నారు. దీంతో పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారని, వారు సివిల్ కేసు కావడంతో పట్టించుకోలేదన్నారు. కోర్టులను ఆశ్రయించినా నిబంధనల ప్రకారం నిర్వహణ చార్జీలు చెల్లించాలని సూచించిందన్నారు. కోర్టు ఆదేశించినా కొందరు నేటికీ చార్జీలు చెల్లించడం లేదని, వారికి సదుపాయాలు ఉండవని స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయిలో కాసుల కక్కుర్తి

డబ్బులు దండుకుంటున్న అధికారులు

- అనుమతిలేకుండానే యథేచ్ఛగా రోడ్డు తవ్వకాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బంజారాహిల్స్, మే 20: లక్షల నిధులతో కాలనీల్లో వేసిన వీడీసీసీ రోడ్లు క్షేత్రస్థాయి సిబ్బంది కాసుల కక్కుర్తితో దెబ్బతింటున్నాయి. జలమండలి ఆధ్వర్యంలో నల్లా కనెక్షన్లు, సీవరేజ్ లైన్ కనెక్షన్ల కోసం రోడ్డు కటింగ్ అనుమతులు లేకుండానే యథేచ్ఛగా రోడ్లను తవ్వేస్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బంజారాహిల్స్ రోడ్ నం-12లోని ఎమ్మెల్యేకాలనీలో ఉమేశ్‌కుమార్ పొద్దార్ అనే వ్యాపారికి జలమండలి ఆధ్వర్యంలో నీటి కనెక్షన్ కోసం అనుమతి ఇచ్చారు. సుమారు 60 నుంచి 80 మీటర్ల మేర వీడీసీసీ రోడ్డుతో పాటు బీటీ రోడ్డును తవ్వి నల్లా కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. దీనికోసం నిర్దేశిత రుసుము చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి రోడ్ కటింగ్ అనుమతి తీసుకోవాల్సి ఉండగా తాను మొత్తం మేనేజ్ చేస్తానని, అవసరమైన అనుమతులు తీసుకుంటానంటూ స్థానికంగా పనిచేస్తున్న వర్క్ఇన్‌స్పెక్టర్ వికాస్ అతడి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసుకున్నాడు. అయితే జీహెచ్ఎంసీ నుంచి అనుమతి తీసుకోకుండానే మూడు రోజులుగా రోడ్డు తవ్వకాలు ప్రారంభం కావడంతో స్థానికులు అడ్డుకున్నారు. తమకు అనుమతి ఉందని సోమవారం దర్జాగా రోడ్డును తవ్వించడంతో పాటు ఏకంగా నల్లా కనెక్షన్ కోసం పైపులు కూడా వేయించడంతో స్థానికులు అక్కడకు చేరుకుని గొడవకు దిగారు. వికాస్ అనే అధికారికి డబ్బులు ఇచ్చేశామంటూ సదరు యజమాని మీడియా సమక్షంలో చెప్పడంతో ఇదే విషయాన్ని జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్ కటింగ్‌కు ఎలాంటి అనుమతి లేదని, రోడ్డు తవ్వకం చేపట్టిన యజమానితో పాటు అతడికి సహకరించిన వర్క్ఇన్‌స్పెక్టర్ వికాస్‌పై చర్యలకు సిఫార్సు చేస్తామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. వెంటనే పనులు నిలిపివేయాలని జలమండలి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా జలమండలి నుంచి ఒక కనెక్షన్ కోసం అనుమతి తీసుకుని అదే వీధిలో ముగ్గురికి సంబంధించిన కనెక్షన్ల కోసం పైపులు వేయడంపై జలమండలి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. నెలరోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్ నం-13లోని ఎమరాల్డ్ స్వీట్స్ సమీపంలోనూ ఇదే విధంగా స్థానిక వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రోద్బలంతో రెండు మీటర్ల అనుమతి తీసుకుని సుమారు 10మీటర్ల దాకా రోడ్లను తవ్వేశారని తెలిసింది. జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల్లోని క్షేత్రస్థాయి సిబ్బంది లోపాయికారీ ఒప్పందాలతో జీహెచ్ఎంసీ రావాల్సిన లక్షలాది రూపాయల రుసుం ఎగవేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకాలనీలో అనుమతి లేకుండా తవ్వేసిన వీడీసీసీ రోడ్డు

వారే వసూలు రాయుళ్లు..

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ్మ, కోఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్

మణికొండ, మే 20: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, మీడియా పేర్లతో ప్రతి బిల్డర్ వద్ద కోట్లు వసూలు చేసి పార్టీ ఫిరాయింది కౌన్సిలర్లేనని మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ్మ, కోఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్ ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు జి.శివారెడ్డి, గోపాల సునీతగణేశ్, పత్తి ప్రవీణ్‌కుమార్ అమ్ముడు పోయారని వైస్ చైర్మన్ చేసిన ఆరోపణలపై ఆదివారం విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ కబ్జారాయుడని వారు పేర్కొన్నారు. స్పందించిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం నార్సింగిలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కోకాపేట్‌లో 220 గజాల గ్రామ కంఠం భూమిని కబ్జాచేసి రూ.2.50 కోట్లకు కౌన్సిలర్లు శివారెడ్డి, దుర్గేశ్‌యాదవ్, విజయ్‌బాబు అమ్ముకున్నారన్నారు. 250 గజాల లేఅవుట్‌లో అందరి పేర్లు చెప్పి లక్షలు వసూలు చేసి దండుకుంటున్నారన్నారు. బీసీ శ్మశానవాటిక స్థలంలో ఇంటి పట్టాలను సృష్టించి కబ్జా చేసి అమ్ముకున్న చరిత్ర వారిదన్నారు.

డబ్బులు డిమాండ్ చేశారు..

అవిశ్వాసం పెడితే కాంగ్రెస్ వారు రూ.15 లక్షలు ఇస్తామన్నారని, పెట్టొద్దంటే మీరు ఎంత ఇస్తారని తనతో ప్రవీణ్‌కుమార్ బేరం మాట్లాడారని ఆరోపించారు. కాంగ్రెస్ వారు రూ.25 లక్షలు ఇవ్వటంతోనే ఆ పార్టీలో చేరి అవిశ్వాసం పెట్టారని వైస్ చైర్మన్ అన్నారు. బుల్కాపూర్ నాలా కబ్జా చేసి తన అపార్ట్‌మెంట్‌కు రూ.70లక్షల మున్సిపల్ నిధులతో రోడ్డు వేసుకున్న చరిత్ర శివారెడ్డిది అని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఉన్న దళిత మహిళను తమ వార్డుల్లో తిరగనివ్వని చరిత్ర వారిదని తీవ్ర ఆరోపణలు చేశారు. వారి కబ్జాలు, అక్రమాలపై తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తామన్నారు.

చలివేంద్రం.. మూడునాళ్ల మురిపెం

సిబ్బంది నిర్లక్ష్యంతో ఆగిపోయిన నీటి సరఫరా

బసవతారకం క్యాన్సర్ దవాఖాన చౌరస్తాలో పనిచేయని జలమండలి చలివేంద్రం

బంజారాహిల్స్, మే 20: వేసవిలో బాటసారులకు చల్లని నీరు ఉచితంగా అందించేందుకు జలమండలి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నెలరోజుల క్రితం జలమండలి ఉన్నతాధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. జలమండలికి చెందిన ట్యాంకర్ల ద్వారా ఇక్కడ ఏర్పాటు చేసిన షెడ్డుపై ఏర్పాటు చేసిన ట్యాంకర్‌లో నీటిని నింపి వాటర్ కూలర్ ద్వారా ఉచితంగా చల్లటినీరు అందిస్తున్నారు. సుమారు 20రోజుల పాటు సక్రమంగానే బాటసారుల దాహార్తిని తీర్చిన ఈ కేంద్రం ఇప్పుడు సిబ్బంది నిర్లక్ష్యంతో పనిచేయడం మానేసింది. వారం నుంచి నీటి సరఫరా లేదని, ట్యాంకర్‌లో నీళ్లు పోయకపోవడంతో నీటి కోసం వచ్చిన తమకు నిరాశ ఎదురవుతోందని స్థానికులు పేర్కొన్నారు. జలమండలి అధికారులు తక్షణమే స్పందించి చల్లని నీటి కేంద్రాన్ని సరిగా పనిచేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బాల్య మిత్రుడికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

బండ్లగూడ, మే 20: ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా అందరితో పంచుకొని ఆ సమస్య పరిష్కరానికి సమిష్టిగా కృషి చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో 1987-88 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు రాజేంద్రనగర్ కిడ్జెకాటే జీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. తమ క్లాస్‌మేట్ రాకేశ్ మృతి పట్ల వారు సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన్‌రావు, ఐలయ్య, కుల్జాగారి శ్రీరాములు, ధనరాజ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మురళి, గోవింద్‌రాజ్, రాజేందర్, సురేశ్, శంకర్, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

శంషాబాద్ రూరల్, మే 20: బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషంగా ఉండేవిధంగా స్వామివారి ఆశీర్వాదం ఉండాలని ఉత్సవాలు నిర్వహించి మొక్కులు చెల్లించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దండుఇస్తారి, గ్రామ నాయకులు, కురుమ సంఘం సభ్యులుప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భాగంగా బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు

వెంచర్ ఫొటోలు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలను చూపుతున్న కౌన్సిలర్ ఆయిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు మురళీయాదవ్

శంషాబాద్ రూరల్, మే 20: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన్నట్లు శంషాబాద్ బీఆర్ఎస్ మున్సినల్ కౌన్సిలర్ ఆయిల్ కుమార్, మురళీయాదవ్ తెలిపారు. శంషాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హిమాయత్‌సాగర్ చెరువును ఆనుకొని కొత్వాల్‌గూడ సర్వే నంబర్ 16లో 18 ఎకరాల భూమిలో గుంతలు(రాళ్లను)ధ్వసం చేసి వెంచర్ ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై కల్లెక్టర్‌తో పాటు హెచ్ఎండీఏ, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జీవో 111 పరిధిలో ఎలాంటి వెంచర్ ఏర్పాటుతో పాటు నిర్మాణాలు చేయకూడదని నిబంధనలు ఉన్న వాటిని తుంగలో తొక్కి యాథేచ్ఛగా వెంచర్ ఏర్పాటు చేసి భారీ ఎత్తున బహుల అంతస్థల భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి రెవెన్యూ పరిధిలో ఎయిర్‌పోర్టు ప్రహారీని ఆనుకొని వెంచర్ చేపడుతున్నట్లు తెలిపారు.

మున్సిపల్ అధికారుల మౌనం..

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భారీగా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ అధికారులు మౌనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అక్రమంగా వెలుస్తున్న వెంచర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకొని హిమాయత్‌సాగర్, గండిపేట్ చెరువులను కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు.

జూన్ 6 నుంచి త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

వివరాలు వెల్లడిస్తున్న కృష్ణారెడ్డి

ఖైరతాబాద్, మే 20: తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనే 6 నుంచి 8వ తేదీ వరకు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడీ ఎడ్యుకేషనల్ అకాడమీలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేన్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణారెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగంతో కలిసి వివరాలు వెల్లడించారు. 25 రాష్ట్రాల నుంచి 750 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 25న అకాడమీలో ఉదయం 10గంటల నుంచి తెలంగాణ త్రోబాల్‌జట్టు ఎంపిక జరుగుతుందని చెప్పారు. అదేరోజు జెర్సీ, లోగోను ఆవిష్కరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరుకావాలని కోరారు. ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిత్ర షెనాయ్, కోశాధికారి ఎస్‌కే జమీల్, సహాయ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాలు కూల్చివేస్తాం

- అకాల వర్షాలతో అప్రమత్తమైన అధికారులు
- పురాతన భవనాలపై స్పెషల్ డ్రైవ్: టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి

యూసుఫ్‌గూడలో పురాతన భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది (ఫైల్)

జూబ్లీహిల్స్, మే 20: అకాల వర్షాలతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రమాదకరంగా ఉన్న పురాతన భవనాలపై దృష్టి సారించారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో శిథిల భవనాలను గుర్తించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ-19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో శిథిల భవనాలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న గృహాలకు కాషన్ నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రమాదాలు జరగకముందే శిథిలావస్థలో ఉన్న భవనాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో పాటు వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో పురాతన భవనాల్లో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో నివాసం ఉండొద్దని.. నివాసితులు ఆయా భవనాలను ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలకు పాత గోడలు కూలే ప్రమాదాలుంటాయని.. ఆయా భవనాల్లో నివాసం ఉంటున్న వారు పాత పాత వి తొలగించి కొత్త గోడలను నిర్మించుకోవాలన్నారు. భవనాలకు మరమ్మతులు చేయించుకోవాలని, లేనిపక్షంలో భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. ప్రమాదాలు జరుగక ముందే శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేస్తే జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కూల్చివేస్తామని చెప్పారు. పాత భవనాల్లో ఉండే వారు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఢిల్లీ ఎన్నికల పరిశీలకుడిగా ఉపేందర్‌రెడ్డి



నియామకపత్రాన్ని అందుకుంటున్న చింతల ఉపేందర్‌రెడ్డి

బంజారాహిల్స్, మే 20: ఢిల్లీ నార్త్ వెస్ట్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యేకాలనీకి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చింతల ఉపేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి ఉదిత్‌రాజ్ నియామకపత్రాన్ని అందజేశారు. నార్త్ వెస్ట్ ఢిల్లీలో సుమారు 25వేల దక్షిణాది ఓటర్లు ఉంటారని, అలాంటి సీటుకు ఎన్నికల పరిశీలకుడిగా నియమించడం సంతోషంగా ఉందని ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

సర్కారు భూమిలో అక్రమ నిర్మాణాలు

- కూల్చేసిన రెవెన్యూ యంత్రాంగం

- తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

మణికొండ, మే 20: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామ సర్వే నంబరు 128లో గత కొన్నాళ్లుగా వెలసిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రంరెడ్డి నేతృత్వంలో రెండు ఇళ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే ఇకపై క్రిమినల్ కేసులను నమోదు చేయిస్తామని హెచ్చరించారు. గతంలో పలుమార్లు అక్రమ నిర్మాణదారులకు నోటీసులను జారీచేసి తెలిపినా అవేమీ పట్టించుకోకుండా తిరిగి సర్కారు భూములో నిర్మిస్తున్న వారిపై చర్యలు ఖచ్చితంగా తీసుకుంటామన్నారు. అదేవిధంగా గతంలో అక్రమ నీటి వ్యాపారాలు చేయొద్దని తెలిపి బోర్లను సీజ్ చేసినా తిరిగి వాటిని నడిపే ప్రయత్నం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని వారిని గుర్తించి వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

మహిళలు మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండలోని ఎగ్జిబిషన్ అండ్ సేల్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ, మే 20: మహిళల కోసం హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు అక్బర్‌అలీ వెల్లడించారు. మణికొండ సుందర్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఈ మేళాను కొనసాగిస్తున్నామన్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, ప్రింటెడ్, డిజైనరీ శారీస్ రకాల చీరలు వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుందని పెద్ద ఎత్తున హాజరై కొనుగోలు నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని రోజులు మాత్రమే ఈ మేళా అందుబాటులో ఉంటుందని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగుబోతులకు అడ్డగా ట్రాఫిక్ బూత్

కృష్ణానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ బూత్‌లో నిద్రపోతున్న మందుబాబు (సర్కిల్)

బంజారాహిల్స్, మే 20: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పరిధిలోకి వచ్చే శ్రీకృష్ణానగర్ సాయి వైన్స్ చౌరస్తావద్ద ట్రాఫిక్ పోలీసుల కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బూత్ తాగుబోతులకు విశ్రాంతి కేంద్రంగా మారింది. అత్యంత రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో జూబ్లీహిల్స్ వైపు నుంచి వచ్చే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు అన్నపూర్ణ ఏడెకరాల స్టూడియో వైపు నుంచి రాంగ్‌రూట్‌లో అనేక వాహనాలు దూసుకువస్తూ ప్రమాదాలకు కారణమవుతుంటాయి. వీటిపై నిఘా పెడుతూ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ బూత్‌లో ఏనాడూ ట్రాఫిక్ సిబ్బంది కూర్చున్న పాపాన పోలేదు. దీంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఈ బూత్‌లో తిష్టవేసి మద్యం సేవించడంతో పాటు అక్కడే నిద్రపోతున్నారు. ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నం-1లోని జీవీకే చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీస్ బూత్‌లో వ్యక్తి దారుణ హత్యకు గురయిన సంఘటన నేపథ్యంలో వెంటనే సంబంధిత అధికారులు నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ పోలీస్ బూత్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

వెనుకబడిన కులాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, మే 20: వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలు సామాజిక, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో బీసీ కులాల లెక్క తేలాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

నిమ్స్‌మేలో అక్రమ చొరబాటు

- గోడ దూకి మారణాయుధాలతో చొరబడ్డ ఆగంతకులు
- తరచూ ఇలాంటి ఘటనలతో నిమ్స్‌మే ప్రతిష్టకు భంగపాటు

వెంగళరావునగర్, మే 20: నిమ్స్‌మేలో అక్రమంగా ఆగంతకులు చొరబడ్డారు. యూసుఫ్‌గూడలో ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ (నిమ్స్‌మే) గోడ దూకి మారణాయుధాలతో జొరబడ్డారు. పోలీసు బెటాలియన్ లైన్ వెనుక నుంచి గోడదూకి వచ్చారు. ఈనెల 19న రాత్రి 2 గంటల సమయాన సెక్యూరిటీ గార్డులు టార్చ్ లైట్ ఫోకస్ వేయడంతో ఆగంతకులు పారిపోయారు. కత్తులు, మారణాయుధాలతో దుండగులు కనిపించారని నిమ్స్‌మే సూపరింటెండెంట్ జేజే భిక్షపతి మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో నిమ్స్‌మేలో చెట్లు నరికి అపహరించుకెళ్లారని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చే ఇక్కడ, తరచూ ఇలాంటి ఘటనలతో నిమ్స్‌మే ప్రతిష్ట మసకబారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ నిర్వహించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా జిమ్నాస్టిక్స్ పోటీలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా జిమ్నాస్టిక్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అమీర్‌పేటలోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో యువ జిమ్నాస్ట్‌లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. బాలికల అండర్-10 తుది పోరులో జైనా పసిడి పతకంతో మెరువగా, తవిషా, మెహ్రీన్ వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మిగతా విభాగాల్లో సాన్వి జైన్, నందు, యువన, భవిక్, సోనాక్షి, మనన్ అగర్వాల్, మనాల్ మక్సూర్, ధృవ్, నియావర్మ